# యవ్వనుడా!! త్రాగుడికి బానిసయ్యావా?

త్రాగుడు ఒక ఫ్యాషన్ అయ్యింది. అదొక స్టేటస్ సింబలయ్యింది. త్రాగి తందనాలాడేవాడు హీరో అవుతున్నాడు. త్రాగని వాడెమో జీరో అవుతున్నాడు. త్రాగిన వాడు ఏమి మాట్లాడతాడో తెలియదు? ఎందుకు నవ్వుతాడో తెలియదు? ఏమి చేస్తాడో తెలియదు? అడుగు ఎక్కడ వేస్తాడో తెలియదు? జేబులు ఖాళీ అయ్యే వరకూ త్రాగుతూ ఊగుతూ ఉంటాడు. ఏ భేదం లేదు. పిల్లలూ, యవ్వనులూ, వృద్ధులూ అందరూ త్రాగుతూనే వున్నారు. దాని ఒడిలో ఊగుతూనే వున్నారు? మత్తు పదార్ధాల మత్తులో జోగుతోంది లోకం. యాక్సిడెంట్లకు కారణం? కుటుంబాలు విచ్చిన్నానికి కారణం? రోగాలు, ఆర్ధిక, మానసిక ఒడిదుడుకులకు కారణం? ప్రశ్నలు ఎన్నైనా కావొచ్చు. సమాధానం మాత్రం ఒక్కటే. అదే "త్రాగుడు వ్యసనం". యువత త్రాగుడుకి బలై పోతుంది. వారి వ్యసనం కోసం వ్యక్తిగత, కుటుంబ గౌరవాన్ని తాకట్టు పెట్టేస్తున్నారు. పెగ్గు కోసం సిగ్గు లేకుండా చేతులు చాస్తున్నారు. కనీసం బర్త్ డే పార్టీలు కూడా బీర్ లతో బార్ లో గడపడానికే సిద్ధపడుతున్నారు? ఒక్క మాటలో చెప్పాలి అంటే? పార్టీ అంటేనే మద్యం, మద్యం లేకపోతే అది పార్టీనే కాదు. ఇప్పుడు ఈ పార్టీలు ఎక్కడివరకు వచ్చేసాయాంటే ? దేవుని సేవకుల ఇంటి వరకు వచ్చేసాయి. ఆంధ్ర ప్రదేశ్ లో గొప్ప వున్నత స్థానంలో నున్న సేవకుని కుమారుని వివాహంలో మద్యం ఏరులై ప్రవహించింది. అయ్యో! అదేమిటి అంటే? వాళ్ళేమన్నా తింగరోళ్ళా ? బైబిల్ కాలేజీల్లో తర్ఫీదు పొందిన రెవరెండ్స్. దానికి క్లారిఫికేషన్ కూడా ఇచ్చారు. బయట నుండి లోనికి వెళ్ళినది ఏది మనలను అపవిత్రపరచదట. మనము పరిశుద్ధముగా కాపాడుకోవలసినది శరీరంను కాదట. ఆత్మను. ఎందుకంటే? మట్టి నుండి తీయబడిన శరీరం మట్టిలోనే కలసిపోతుందట. ఆత్మ మాత్రమే దేవుని దగ్గరకు వెళ్తుంది. కాబట్టి, ఆత్మకు మాత్రం ఎట్లాంటి కళంకం అంటుకోకుండా చూచుకోవాలట. ఎంత బాగా చెప్పారు కదా? అయితే, పౌలు ఇట్లా ఎందుకు వ్రాశాడో? శరీరం మలినమై పోయినప్పుడు, ఆత్మ ఎట్లా పరిశుద్ధంగా వుండగలుగుతుందో? “ ప్రియులారా, మనకు ఈ వాగ్దానములు ఉన్నవి గనుక దేవుని భయములో పరిశుద్ధతను సంపూర్తిచేసి కొనుచు, శరీరమునకును ఆత్మకును కలిగిన సమస్త కల్మషము నుండి మనలను పవిత్రులనుగా చేసికొందము”. 2 కొరింది 7:1; మరికొంత మంది ఇంకా తెలివిగా మాట్లాడతారు. పౌలు తిమోతికి వ్రాసాడు కదా? అని. ఏమని వ్రాసాడు? “ ఇకమీదట నీళ్లే త్రాగక నీ కడుపు జబ్బునిమిత్తమును తరచుగా వచ్చు బలహీనతల కోసరమును ద్రాక్షారసము కొంచెముగా పుచ్చుకొనుము”. 1తిమోతి 5:23; కడుపు జబ్బు నిమిత్తం

ద్రాక్షారసం పుచ్చుకోమని. అయితే, ఈ త్రాగే వాళ్లంతా కడుపు జబ్బుకోసమే త్రాగుతున్నారా? అయినా. ద్రాక్షారసము, మద్యము రెండూ ఒక్కటేనా? ద్రాక్షారసము పులియబెడితే మద్యం అవుతుంది. కడుపు జబ్బుకు కొంచెం ద్రాక్షారసము త్రాగమని తిమోతికి సూచిస్తున్నాడు పౌలు. అంటే? తిమోతి కడుపు జబ్బుతో బాధ పడుతున్నాడు. అది అతడు త్రాగే నీరు సరైనది కాకపోవడం వలన కలిగినది. ఆ దినాలలో ఔషధాలు అందుబాటులో లేనికారణం చేత, ద్రాక్షారసంలో కొన్ని ఔషధ గుణాలు వుండడం చేత త్రాగే నీటిలో కొంచెం ద్రాక్షారసం కలుపుకొని త్రాగడం సర్వ సాధారణం. మన వాళ్లేమో మద్యంలో నీళ్లు కూడా కలపకుండా త్రాగుతూ దీనిని పౌలు మాటలకు జత కట్టేసారు. ఒక్క విషయం గుర్తుంచుకో విషం కలిగి యున్న సీసా మీదా 'విషం' అనే పేరు తీసేసి, 'అమృతం' అని వ్రాసినంత మాత్రాన అది అమృతముగా మారిపోదు కదా? 'పాపము' అనే దానిని 'పొరపాటు' అని పిలచుకున్నంత మాత్రాన అది పాపం కాకుండా పోదుగా.

నాకు తెలిసిన ఒకాయన గల్ఫ్ నుండి వచ్చి, కృతజ్ఞతా కూడిక పెట్టుకొని, సంఘ పెద్దలందరికీ పార్టీ ఇచ్చాడు. అయ్యగారు ఒక్కరే వున్నారని, ఒకాయన వెళ్లి, అయ్యగారూ మీరు కూడా ఒక పెగ్గు పుచ్చుకుంటారేంటి ? అనడిగితే? ఆ అయ్యగారు ఫారిన్ ది అయితే, పర్వాలేదన్నాడట! ఇంకేముంది? అయ్యగారే పార్టీలో వుంటే? పెద్దలకెంత బలం? విశ్వాసులకు ఇంకెంత బలం? కంచే చేను మేసేస్తుంటే? ఇక కాపాడేదెవరు? సంఘానికి మాదిరికరంగా వుంటూ, ఆధ్యాత్మిక విలువలు నేర్పాల్సిన నీవే గాఢాంధ కారములో కొట్టుమిట్టాడుతుంటే? ఇక సామాన్యుల గతేమిటి? మద్యం సేవించేవారు సంఘ పెద్దలుగా ఉండకూడదు. 1తిమో3:3; నీవంటావ్! ఆయన త్రాగడం లేదా? ఈయన త్రాగడం లేదా అని. ఆయన సంగతి. ఈయన సంగతి నీకెందుకు? నీవు చూడాల్సింది ఆయనను, ఈయనను కాదు. నీ పరిశుద్ధుడైన దేవునిని మాత్రమే. అనుసరించాల్సింది ఆయనను, ఈయనను కాదు. పరిశుద్ధ గ్రంధమును మాత్రమే. మరి కొందరంటారు! పరిశుద్ధ గ్రంధంలో ఆయన త్రాగలేదా? ఈయన త్రాగలేదా అని. అవును! త్రాగారు. ప్రతిఫలాన్ని అనుభవించారు. నీ జీవితం అట్లా కాకూడదనే, వారి జీవితాలను దృష్టాంతాలుగా నీ ముందుంచాడు దేవుడు.

మద్యం వలన నోవాహు వస్త్రహీనుడయ్యాడు. నోవహు నీతిపరుడును తన తరములో నిందారహితుడునై యుండెను. నోవహు దేవునితో కూడ నడచినవాడు. ఆది 6:9; అట్లాంటి వ్యక్తిని ద్రాక్షారసము వస్త్రహీనుని చేసింది. పిమ్మట ద్రాక్షారసము త్రాగి మత్తుడై తన గుడారములో వస్త్రహీనుడుగా నుండెను. ఆది 9:21; మొట్టమొదటగా ద్రాక్ష తోట వేసింది

నోవహునే కాబట్టి, అట్లా జరుగుతుందని అతనికి తెలుసో? లేదో? అందుచే, పూర్తిగా అతనిని తప్పు పట్టలేము.

- **మద్యం వలన అల్లరి పుట్టును**

" ద్రాక్షారసము వెక్కిరింతల పాలుచేయును మద్యము అల్లరి పుట్టించును". సామెతలు 20:1

- **మద్యం వలన జ్ఞానము లేనివారు అగును**

"ద్రాక్షారసము వెక్కిరింతల పాలుచేయును మద్యము అల్లరి పుట్టించును దాని వశమైనవారందరు జ్ఞానములేనివారు". సామెతలు 20:1

- **మద్యం వలన దరిద్రులు అగుదురు.**

త్రాగుబోతులును తిండిపోతులును దరిద్రులగుదురు. సామె 23:21

- **మద్యం వలన శ్రమలు, దుఃఖము, గాయములు కలుగును.**

"ఎవరికి శ్రమ ? ఎవరికి దుఃఖము ? ఎవరికి జగడములు ? ఎవరికి చింత ? ఎవరికి హేతువులేని గాయములు ? ఎవరికి మంద దృష్టి ? ద్రాక్షారసముతో ప్రొద్దుపుచ్చువారికే గదా కలిపిన ద్రాక్షారసము రుచిచూడ చేరు వారికే గదా". సామెతలు 23:29,30

- **మద్యం వలన ఆజ్ఞలు మరతురు**
- ద్రాక్షారసము త్రాగుట రాజులకు తగదు లెమూయేలూ, అది రాజులకు తగదు మద్యపానాసక్తి అధికారులకు తగదు. త్రాగినయెడల వారు కట్టడలను మరతురు దీనులకందరికి అన్యాయము చేయుదురు సామెతలు 31:4,5

- **మద్యం వలన పరలోకం వెళ్లలేరు.**

దొంగలైనను లోభులైనను త్రాగు బోతులైనను దూషకులైనను దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు.

- **దుర్వ్యాపారం నడుపుతురు.**

మద్యముతో మత్తులైయుండకుడి, దానిలో దుర్వ్యాపారము కలదు; అయితే ఆత్మ పూర్ణులైయుండుడి. ఎఫెసి 5:18

- **మతి చెడును**

“వ్యభిచారక్రియలు చేయుట చేతను ద్రాక్షారసము పానము చేయుట చేతను మద్యపానము చేతను వారు మతిచెడిరి”. హోషేయ 4:11

- **జబ్బు పడుదురు.**

“మన రాజు దినమున అధిపతులు అతని ద్రాక్షారస బలముచేత మత్తిల్లి జబ్బుపడిరి”. హోషేయ 7:5

- **తత్తర పడుదురు**

“అయితే వీరును ద్రాక్షారసము వలన సొక్కి సోలుదురు మద్యము వలన తత్తరపడుదురు యాజకులేమి ప్రవక్తలేమి అందరును మద్యమువలన సొక్కి సోలుదురు ద్రాక్షారసము వారిని మింగివేయుచున్నది మద్యమువలన తత్తరపడుచున్నారు దర్శనము కలుగునప్పుడు సోలుదురు తీర్పుతీర్చుకాలమున తత్తరపడుదురు”. యెషయా 28:7

- **చెడు పాటలు పాడుదురు**

గుమ్మములలో కూర్చుండువారు నన్నుగూర్చి మాట లాడుకొందురు త్రాగుబోతులు నన్నుగూర్చి పాటలు పాడుదురు. కీర్తనలు 69:12

- **త్రాగుబోతులకు శ్రమ**

ద్రాక్షారసము త్రాగుటలో ప్రఖ్యాతినొందిన వారికిని మద్యము కలుపుటలో తెగువ గల వారికిని శ్రమ. యెషయా 5:22

ఇటువంటి త్రాగుబోతులతో సహవాసము చేయకూడదు. (సామెతలు 23:20)

కావున ప్రియ సహోదరి సహోదరుడా! నీ సహవాసం ఎవరితో చేస్తున్నావ్?

అటువంటి త్రాగుడికి, త్రాగుబోతు విందులకు మనం దూరమై, పరమపురికి చేరుదాం

! ఆమెన్! ఆమెన్! ఆమెన్!